స్వర్ణాంధ్ర 2047
జిల్లా ప్రణాళిక రూపొందించాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

అభివృద్ధి లక్ష్యాలతో స్వర్ణాంధ్ర 2047 జిల్లా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్, హార్టికల్చర్ అభివృద్ధి, వ్యవసాయం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సీపీవో హిమప్రభాకర్ రాజు, ఏపీఐఐసీ జడ్ఎం శ్రీనివాసరెడ్డి, ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల డీన్ సత్యబాబు, కృష్ణారావు, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:

దేవరగట్టుపై గొరవయ్యల గొలుసాట



దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో దసరా బన్ని ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం గొరవయ్యల నృత్యాలు, గొలుసు తెంపే కార్యక్రమం కనుల పండువగా సాగింది. సింహాసనకట్ట (కల్యాణకట్ట) వద్ద గొరవయ్య 51వ ప్రయత్నంలో ఇనుప గొలుసు తెంచడంతో ఆలయ ప్రాంగణం ఒక్కసారిగా డిర్ర్‌ర్‌ర్.. గోపరాక్ నినాదాలతో మార్మోగింది. మాళ మల్లేశ్వరస్వామికి నైవేద్యంగా సమర్పించే పాయసం తాగేందుకు చేసిన విన్యాసాలు కట్టిపడేశాయి. ఉత్సవమూర్తులను సింహాసనకట్ట నుంచి గట్టు మీదకు చేర్చడంతో పాటు కంకణ విసర్జన, వసంతోత్సవం


హొళగుంద (హాలహర్వి), న్యూస్‌టుడే

గృహాత్తర ప్రణాళిక

పీఎంఏవైలో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణానికయ్యే ఖర్చంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది.. వీటికి గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల బోర్డులు తగిలించుకుంది. తామే నిధులు ఇచ్చినట్లు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంది. బిల్లులు పూర్తిస్థాయిలో ఇవ్వక నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలు మధ్యలో ఆపేశారు. గతంలో ఇంటిపని మొదలుపెట్టి పూర్తి చేయని వాటి గడువు త్వరలోనే ముగియనుంది. ఇలాంటి వారంతా భవిష్యత్తులో బిల్లులు నష్టపోతారు. కొత్త పథకానికి అర్హత ఉండదు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

■ అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు
■ 'మన ఇల్లు.. మన గౌరవం' పేరుతో అవగాహన

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :



జిల్లా	వంద రోజుల్లో పూర్తి చేయాల్సింది	రోజువారీ లక్ష్యం	గడిచిన 23 రోజుల్లో పూర్తైనవి
కర్నూలు	6,672	84	152
నంద్యాల	3,862	46	249

ఒక్కో అధికారికి రెండు కాలనీలు

"మన ఇల్లు.. మన గౌరవం" పేరిట అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో అధికారికి రెండు కాలనీల బాధ్యతలు అప్పగించారు.. పునాది నుంచి లెంటల్ స్థాయిలో ఉన్న ఇళ్లను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉంది. స్లాబు స్థాయి/స్లాబు వేసిన వాటిని ఈ ఏడాది అక్టోబరులోగా పూర్తి చేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తేనే..

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా గృహనిర్మాణ శాఖలో ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు.. ఇలా అందరిని సమన్వయం చేసుకొని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి.

ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు


● ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. రూ.1,700 కోట్లను బిల్లుల చెల్లింపుల కోసం నిధులు అందుబాటులో ఉంచిందని గృహ నిర్మాణ ఇంజినీర్లు పేర్కొంటున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకొని బిల్లులు పెట్టిన వెంటనే చెల్లిచేస్తారు. కానీ ఇళ్ల నిర్మాణాల్లోనే జాప్యం జరుగుతోంది.

● వివిధ దశల్లో ఆగిన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు రోజువారీగా లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించింది. లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాలు లేదా బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయించేలా చర్యలు చేపట్టింది. పీఎంఏవైలో భాగంగా మంజూరైన నిధులను వినియోగిస్తే తప్ప కొత్త నిధులు రావు. గతంలో మంజూరైన నిధులు వచ్చే ఏడాది మార్చికల్లా వెనక్కి వెళ్లిపోతాయి.

లక్ష్యం 2,990.. పూర్తైంది 40!

● అసంపూర్తిగా ఉన్న ఇళ్ల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఉన్నాయన్న దానిపై సమగ్ర సమాచారం సేకరించారు. ఇందు కోసం సచివాలయానికి ఒక నోడల్ అధికారితో ప్రత్యేక బృందం ఏర్పాటుచేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి కారణాలు తెలుసుకుంటున్నారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులను తక్కువ ధరకు పనిచేసేలా మాట్లాడటం.. వీలైనంత తక్కువ ధరలకు సామగ్రి ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు.

● ఈ ఏడాది సెప్టెంబరు 23 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు గృహ నిర్మాణ శాఖలో వంద రోజుల లక్ష్యాలు నిర్దేశించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మంజూరై.. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంద రోజుల్లో 10,534 నిర్మాణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. గత 23 రోజుల వ్యవధిలో పురోగతి అంతంతమాత్రంగానే ఉంది.


కుళ్లిన ఉల్లిగడ్డలు

చినుకు రాలుతోంది
కునుకు కరవైంది

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఆగస్టు రెండో వారం నుంచి సెప్టెంబరు మొదటి వారం వరకు అధిక వర్షాలు పంటలకు చేటు తెచ్చాయి. . తేమ శాతం పెరిగి పంటలు దెబ్బతిన్నాయి. ఉల్లి కుళ్లిపోయింది.. మిరప రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. మొక్కజొన్న పూత రాలిపోయి గింజ కట్టని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 8,619.49 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారికంగా నివేదించారు. ఉన్న కొద్దిపాటి పంట చేతికొచ్చిన దశలో అల్పపీడనం వార్తతో అన్నదాతలకు గుబులు పుట్టిస్తోంది. రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 16, 17 తేదీల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది. ఈ వార్త అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

✦ కొన్ని చోట్ల ఉల్లి కోసి ఆరబెట్టుకోగా.. మరికొన్నిచోట్ల కోతకు వచ్చింది.. ఉల్లి రైతు అటు అధిక వర్షాలతో కొంత నష్టపోగా.. ప్రస్తుతం తుపాను ప్రభావంతో ఆందోళనలో మునిగిపోయారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధర రాదు.. దిగుబడులు ఆరబెట్టుకునే పరిస్థితి లేదు.

✦ ప్రస్తుతం పత్తి తీత పనులు సాగుతున్నాయి. ఒక క్వింటా పత్తి తీసేందుకు కూలీ రూ.1000 ఖర్చవుతుంది. ప్రస్తుతం రెండు, మూడో తీతకు పత్తి సిద్ధంగా ఉంది.. భారీ వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పత్తి మట్టిపాలవుతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వంతెన కేసీ చూడండి

పూడూరు వద్ద కర్నూలు-కడప (కేసీ) కాలువ వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాంతం నుంచే తెలంగాణలోని అలంపూర్ ప్రాంతానికి చేరుకోవచ్చు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతినడంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

– ఈనాడు, కర్నూలు

ఘనులపై ఉక్కుపాదం

గనుల ఖిల్లా డోన్ ప్రాంతంలో గత ఐదేళ్లు వైకాపా ముఖ్య నేతలు, వారి అనుచరులు గనులను మింగేశారు. అడ్డగోలుగా తవ్వేసి అందినకాడికి దండుకొన్నారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలో వచ్చి నాలుగు నెలలు దాటినా కొందరు 'ఘనులు' నేటికీ అక్రమ దందా కొనసాగిస్తున్నారు.. వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్థానిక ఎమ్మెల్యే గనులశాఖ అధికారులను, పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత రెండు నెలల కాలంలో ఏకంగా 17 మందిపై కేసులు చేయడం గమనార్హం. ఏఏ గనుల్లో ఎంతెంత పరిమాణాన్ని అక్రమంగా తవ్వేశారో లెక్కలు తీస్తున్నారు.

ఈనాడు, కర్నూలు, డోన్, న్యూస్‌టుడే:



లోతుగా తవ్వేస్తున్నారు

● గనుల్లో 3 మీటర్ల నుంచి 9 మీటర్ల వరకు బెంచ్ కటింగ్ చేపట్టాలి. ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు. 60 నుంచి 100 అడుగుల లోతులో తవ్వకాలు చేపడుతున్నారు. దీనివల్ల పైప్రాంతం పగుళ్లు వచ్చి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. బెంచ్ కటింగ్ పద్ధతిని విస్మరించి తవ్వకాలు చేపట్టినచోట పైభాగం కూలిపోయి రాళ్లు పడి పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి.

● గనుల కింది భాగంలో ట్రాక్టర్ల కంప్రెషర్ల ద్వారా పేలుడు పదార్థాలతో తవ్వుతున్నారు. దీంతో గ్రామంలో ఇళ్లు బీటలు బారుతున్నాయి. 'బీ' విభాగం కిందకొచ్చే ఖనిజాలకు బ్లాస్టింగ్‌కు అనుమతులు లేకపోయినా పేలుళ్లు సాగిస్తున్నారు.

● కొందరి లీజు గడువు ముగిసింది. వైకాపా ముఖ్యనేతల అండదండలు ఉండటంతో లోతుగా తోడేశారు. లీజులు ఒకచోట ఉండగా.. తవ్వకాలు మరోచోట చేపడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

ఎనిమిది మందికి తాఖీదులు

ప్యాపిలి, డోన్ మండలాల్లో ఎనిమది మందికి సంబంధించిన క్వారీల్లో తనిఖీలు చేశారు. పరిమితికి మించి తవ్వేశారని నిర్ధారించారు. వారికి నోటీసులు ఇచ్చారు. అనుమతులు తీసుకున్నచోట కాకుండా ఆయా పరిమితులను అడ్డం పెట్టుకుని వేరేచోట్ల తవ్వకాలు సాగించినట్లు నిర్ధారించారు. నోటీసులు అందుకున్న ఆ ఎనిమిది మంది వైకాపాకు చెందినవారే. డోలమైట్, మెజాయిక్ చిప్స్, వైట్‌షేల్, పరిశ్రమలకూ తాఖీదులు ఇచ్చారు.

తెల్ల సుద్దను మింగేశారు

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో బనగానపల్లి, అవుకు, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, పాణ్యం, డోన్, ప్యాపిలి, కృష్ణగిరి, వెల్దుర్తి, ఓర్వకల్లు, సి.బెళగల్ తదితర మండలాల్లో గనులు ఉన్నాయి. ఒక్క నంద్యాల జిల్లా పరిధిలోనే వెయ్యి వరకు క్వారీలు ఉన్నాయి. డోన్ నియోజకవర్గ పరిధిలో చిన్నమల్కాపురం, పెద్దమల్కాపురం, జలదుర్గం, కొచ్చెర్వు, బావిపల్లె, చంద్రపల్లె ప్రాంతాల్లో డోలమైట్, లైమ్‌స్టోన్, వైట్‌షేల్, స్టీటైట్, వైట్‌క్లే, తెల్ల సుద్ద వంటి ఖనిజాలు ఎక్కువగా ఉన్నాయి.

● ప్యాపిలి మండలం బావిపల్లి, డోన్ మండలం చిన్నమల్కాపురం, బేతంచెర్ల మండలంలోని పలు గ్రామాల్లో వైట్‌షేల్(సుద్ద)పై అక్రమార్కులు లక్ష్యంగా చేసుకొన్నారు. నిత్యం వందకు పైగా టిప్పర్లు తిరిగినట్లు అధికారులు గుర్తించారు. గనుల నుంచి అనుమతులు లేకుండా సరకు తరలిస్తున్న వాహనాల నుంచి ఏకంగా రూ.10 లక్షల వరకు అపరాధ రుసుములు వసూలు చేశారంటే అక్రమ రవాణా ఏస్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

● సుద్ద రాయికి టన్నుకు కేవలం రూ.వంద నుంచి రూ.130ల ధర పలుకుతుంది. నిత్యం డోన్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి వంద వరకు టిప్పర్లలో ఇష్టారాజ్యంగా తరలించేశారు.

అల్పపీడనం.. అధికారుల అప్రమత్తం

■ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.. అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. భారీ వర్ష సూచన మేరకు ఆయన సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఇతర క్షేత్రస్థాయి అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు.

★ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు.. ఏ సమస్య ఉన్నా 08518-277305 నంబరుకు ఫోన్ చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ప్రజలకు సూచించారు. అదే విధంగా మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

టెట్‌కు 2,675 మంది హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2,675 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌లో 1,505 మందికిగాను 1,342 మంది, మధ్యాహ్న సెషన్‌లో 1,505 మందికి 1,333 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు. మొత్తం 335 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఇన్‌ఛార్జి మంత్రుల రాక
సాగునిధికి ఊరట

ఈనాడు, కర్నూలు: జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. కర్నూలుకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, నంద్యాలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లను నియమించడంతో అభివృద్ధి అడుగులు వేగంగా పడే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఎక్కువగా ఉన్నాయి.. గత వైకాపా హయాంలో చిల్లిగవ్వ ఇవ్వకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.. మరో 3.23 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశాలున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. చిన్న, సన్నకారు రైతులెక్కువగా ఉన్న కర్నూలు జిల్లాలో చాలా మంది ఒక పంటతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో జల వనరులు, ఆర్థిక శాఖ మంత్రులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వడంతో సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఎలాంటి ప్రాజెక్టులకైనా ఆర్థికశాఖ ఆమోదం ఉండాల్సిందే. ఆర్థికశాఖ మంత్రి సిఫార్సులుంటే గుత్తేదారులూ పనులు వెంటనే పూర్తి చేస్తారు. బిల్లులు త్వరగా వస్తాయన్న భరోసాతో గుత్తేదారులు ఆయా పనులు పూర్తిచేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. పయ్యావుల కేశవ్‌ను నంద్యాల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించడంతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులకు అడ్డంకిగా మారిన ఆర్థిక సమస్యలు తొలగిపోయినట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.



వీటిపై దృష్టి సారించాలి


- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు 10 శాతం కూడా పూర్తికాలేదు.
- 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని ప్రతిపాదించిన గుండ్రేవులను గత ప్రభుత్వం వదిలేసింది.
- సుంకేసుల గేట్లు దెబ్బతిన్నా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు.
- కేసీ కాల్వ మరమ్మతులకు రూ.536 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేసినా పట్టించుకోలేదు.
- హంద్రీనీవా పంట కాల్వలు పూర్తి చేయలేదు. ఫలితంగా 40వేల ఎకరాలకు నీరందని పరిస్థితి నెలకొంది.
- ఆధునికీకరణ పేరుతో గాజులదిన్నె జలాశయాన్ని చిదిమేశారు.
- రెండు తెలుగు రాష్ట్రాలకు అతిముఖ్యమైన శ్రీశైలం జలాశయం ముందు ఏర్పడ్డ గొయ్యిని పూడ్చలేకపోయారు.
- నిర్వహణలేక గోరుకల్లుకు ప్రమాదం పొంచి ఉంది.

ఆయకట్టులో ఎవరిదో పట్టు

■ సాగునీటి సంఘాల ఎన్నికల నగారా ■ నేటి నుంచి ప్రారంభం కానున్న ప్రక్రియ

ఉమ్మడి జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగనుంది. బుధవారం నుంచి ఎన్నికల క్రతువు ప్రారంభం కానుంది. నవంబరు 24లోపు సాగునీటి సంఘాల కమిటీల ఏర్పాటును పూర్తి చేయనున్నారు. ఈ క్రతువును పూర్తి చేసేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల నోడల్ అధికారులుగా డీఆర్వో పద్మజ, ఇరిగేషన్ ఎస్ఈ వరప్రసాద్‌లను నియమించారు. ఆయా ప్రాదేశికాల్లో సర్వే నంబర్ల ప్రకారం రైతుల జాబితాను తయారు చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

నంద్యాల పట్టణం, కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే :



కమిటీలో 6-8 మంది సభ్యులు

వివిధ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. వీటిలో ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉండనున్నారు. మూడు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలో ఒక్కో సాగునీటి సంఘంలో 6 నుంచి 8 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎన్నికైన సభ్యులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. తొలి దశలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయి. రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీల పాలకవర్గాలను ఎన్నుకుంటారు. మూడో దశలో ప్రాజెక్టు కమిటీకి సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకుంటారు.

ఐదేళ్లలో అస్తవ్యస్తం

1997లో తెదేపా ప్రభుత్వం సాగునీటి సంఘాల వ్యవస్థను తీసుకొచ్చింది. పంట కాలువల పరిధిలోని రైతులకు ఓటు హక్కు కల్పించింది. 2015లో నామినేషన్ పద్ధతిలో తెదేపా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఛైర్మన్లను నియమించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించలేదు. ఉన్న సంఘాలను రద్దు చేసింది. సాగునీటి వ్యవస్థ అభివృద్ధిని తీవ్ర నిర్లక్ష్యం చేసింది. చేసిన అరకొర పనులను కూడా ఇరిగేషన్ శాఖ అధికారులతోనే చేపట్టింది. వాటికి నిధులు కూడా విడుదల చేయలేదు. దీంతో కాలువలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

మొత్తం 370 సంఘాలు

- తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలో నంద్యాల, వైఎస్సార్ జిల్లాల పరిధిలోని 18 మండలాల్లో స్థిరీకరించిన 1,31,079 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.
- కేసీ కాల్వ పరిధిలో కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లోని 18 మండలాల్లో 1,51,592 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలకు కమిటీలను ఎన్నుకోనున్నారు.
- ఎస్సార్బీసీ పరిధిలో నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లోని 9 మండలాల్లో 1,51,925 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి 50 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.
- చిన్ననీటి పారుదల శాఖ పరిధిలో జిల్లాలోని 18 మండలాల్లో 43,200 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి 105 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 249 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.
- కర్నూలు జిల్లాలో 121 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. టీబీపీ లోలెవల్ కెనాల్ పరిధిలో 1,51,134 ఎకరాల ఆయకట్టుకు సంబంధించి 58 సాగునీటి సంఘాలకు నూతన కమిటీలను ఎన్నుకుంటారు.
- ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 6, హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని 3, గాజులదిన్నె ప్రాజెక్టుకు సంబంధించి 12 సంఘాలకు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 41, రామాపురం ఛానల్‌కు సంబంధించిన ఒక సంఘానికి ఎన్నికలు జరగనున్నాయి.

ఈ-శ్రమ్ కార్డులు.. కార్మికులకు వరం



అసంఘటిత రంగ కార్మికులకు కేంద్రం వివిధ పథకాలు అందజేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 40 లక్షలకు పైగా జనాభా ఉండగా, అసంఘటిత రంగ కార్మికులు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల వరకు ఉంటారని అంచనా. ఇందులో కర్నూలు, నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు ఈ-శ్రమ్ కింద 6.16 లక్షల మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వీరికి యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబరు (యూఏఎన్) వస్తుంది. ఈ-శ్రమ్ కింద నమోదు చేసుకున్న వారు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగి ప్రమాదంలో మరణిస్తే రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, డోన్

ఎవరెవరంటే..?

టైలు, ఎంబ్రాయిడరింగ్, డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు, చేనేత, కుమ్మరి, స్వర్ణకారులు, కమ్మరి, క్షౌర వృత్తి, బ్యూటీపార్లర్‌లో పనిచేసే వారు, రజకులు, వీధి వ్యాపారులు, తోపుడుబండి వ్యాపారులు, చిరు వ్యాపారులు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, బీడీ కార్మికులు, ఎన్ఆర్ఈజీఎస్, ఆశా వర్కర్లు, ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీలు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు ఈ-శ్రమ్‌కార్డులకు దరఖాస్తు చేయొచ్చు.


నమోదుకు కావాల్సినవి ఇవీ..

- ఈకేవైసీ కలిగిన ఆధార్ ఉండాలి.
- ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి నంబరు
- ఆధార్ నంబరు నమోదు చేయగానే మొబైల్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ సదుపాయం లేకపోతే బయోమెట్రిక్ ఫింగర్‌ప్రింట్లు, ఐరిస్, బ్యాంకుఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలతో సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకుంటే యూఏఎన్ కార్డు జారీ చేస్తారు.
- 16 నుంచి 59 ఏళ్లలోపువారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆదాయ పన్ను చెల్లించనివారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేనివారు అర్హులని గుర్తించాలి.

ఎనిమిది మందికి బీమా

ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకున్న వారు ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఇలా నమోదు చేసుకున్న దరఖాస్తులు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయానికి వెళ్తాయి. అక్కడి నుంచి వివరాలన్నింటిపై విచారణ చేసి కలెక్టర్ అనుమతికి పంపుతారు. ఇలా ఎవరైనా ఈ-శ్రమ్ కార్డు ఉండి ప్రమాదం జరిగితే నమోదు చేసుకోవచ్చు. నంద్యాల జిల్లాలో ఎనిమిది మందికి ప్రమాద బీమా సాయం అందించినట్లు నంద్యాలజిల్లా కార్మికశాఖ అధికారిణి బషీరున్నీసాబేగం తెలిపారు.

అల్పపీడన ప్రభావం.. అప్రమత్తతతో నష్టాలు దూరం



అల్పపీడన ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే ఆకాశం మేఘావృతమై ఉంది. ఈ నేపథ్యంలో ఉద్యాన రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. పంటలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అప్పుడే నష్టాన్ని నివారించుకునే అవకాశముంటుంది.

ఉద్యాన రైతులూ.. ఇవి పాటించండి

ఉల్లి కోతలు కోయొద్దు

కోతకు సిద్ధంగా ఉన్న ఉల్లిని వర్షాలు ఆగేవరకు కోతలు కోయకూడదు. ఒకవేళ కోసి ఉంటే త్వరగా తగిన మార్కెట్‌కు తరలించాలి. లేదా పట్టలతో కప్పి తడవకుండా చూసుకోవాలి. పొలంలో నీరు నిలిస్తే మొక్కలు కుళ్లిపోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు నీరు బయటకు వెళ్లేలా చూడాలి. ఉల్లి గడ్డ దెబ్బతినకుండా ఉండేందుకు రిడోమిల్ గోల్డ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కొత్తగా నారు నాటేవారు వర్షాలు ఆగిపోయిన తర్వాత నాటుకోవాలి.

అరటి, బొప్పాయిలో జాగ్రత్తలు ఇలా..

● పెనుగాలులతో కూడిన వర్షం కారణంగా గెలలు ఉన్న అరటి చెట్లు పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అరటి చెట్లు పడిపోకుండా కట్టెల సాయంతో ముందు జాగ్రత్తగా ఊతమివ్వాలి. కోతకు వచ్చిన గెలలను ముందుగానే కోత కోసి అమ్ముకోవాలి.

● బొప్పాయిలో కోతకు సిద్ధంగా ఉన్నవాటికి ముందుగానే కోత కోసి విక్రయించుకోవాలి. కోతకు వచ్చిన పండ్లను సరైన రీతిలో ప్యాకింగ్ చేసి ప్యాక్ హౌస్‌ల్లో నిల్వ ఉంచుకోవాలి. ఫలితంగా నష్టాన్ని కొంతమేర అధిగమించవచ్చు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

టమాటాలో మచ్చ తెగులు

వర్షం కురిసే సమయంలో టమాట కోతలు కోయకూడదు. వర్షం రాకముందే కోత కోసి విపణికి తరలించి విక్రయించుకోవాలి. కోతకి సిద్ధంగా ఉన్నవాటిని కోసి సరైన గాలి ప్రసరించే ప్రదేశంలో నిల్వ చేసుకోవాలి. అధిక వర్షాల కారణంగా మచ్చ తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా 2.5 గ్రాముల ఎం.45 ఒక గ్రాము కార్బెండిజమ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పండ్లు, కూరగాయల తోటల రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను సంరక్షించుకోవాలి.

నాడు ఇసుక తిన్నెలు.. నేడు జల పరవళ్లు



నిన్నటి వరకు తుంగభద్ర నదిలో నీటినిల్వ తగ్గిపోయి తేలిన ఇసుక



ప్రస్తుతం నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

తుంగభద్ర జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కర్నూలు వద్ద తుంగభద్ర నది నీటితో కళకళలాడుతోంది. మొన్నటివరకు నీటి నిల్వ తగ్గిపోయి ఇసుక తిన్నెలు దర్శనమివ్వగా.. ప్రస్తుతం వరదనీరు చేరడంతో నిండుకుండను తలపిస్తోంది. కర్నూలు జాతీయ రహదారి వంతెన దిగువన నీటి ప్రవాహం అందరినీ ఆకట్టుకుంటోంది. - ఈనాడు, కర్నూలు

నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

● తనిఖీ పూర్తైతే రెగ్యులర్ లైసెన్సుల జారీ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి నూతన మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో ఏడు ఆబ్కారీ స్టేషన్ల పరిధిలో 99 మద్యం దుకాణాల అనుమతుల కేటాయింపు ప్రక్రియ పూర్తైన సంగతి విదితమే. బ్యాంకు గ్యారెంటీతోపాటు తొలివిడత వార్షిక రుసుము చెల్లించి అనుమతుల దక్కించుకున్న వ్యక్తులకు ప్రస్తుతం తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. ఐఎంఎల్ డిపోలో మద్యం తీసుకొనేందుకు బ్యాంకుతో అనుసంధానం చేసిన రిటైలర్ కోడ్ జారీ చేస్తారు. ఒక్కో అనుమతిదారుడికి ఒక్కో రిటైలర్ కోడ్ ఉంటుంది. సాంకేతిక చెల్లింపుల ద్వారా ఐంఎంఎల్ డిపో అధికారులు వ్యాపారులకు మద్యం విక్రయిస్తారు. మద్య నిషేధ ఆబ్కారీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో దుకాణాలు పరిశీలించి నిబంధనల ప్రకారం దుకాణం ఉన్నట్లు నిర్ధారించిన తర్వాత రెగ్యులర్ లైసెన్సు జారీ చేస్తారు.

దుకాణాల కోసం వెదుకులాట

చాలా ప్రాంతాల్లో పాత ప్రభుత్వ దుకాణాల్లో ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. మరికొందరు కొత్త దుకాణాలు వెతుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఖాళీ చేయించే పనిలో పడ్డారు. దుకాణాల్లో ఉన్న సరకు లెక్కించి ఐఎంఎల్ డిపోకు చేర్చనున్నారు. కొత్త అనుమతుదారులకు బుధవారం నుంచి ఐఎంఎల్ డిపోలో మద్యం సరకు ఇస్తారు.

నగదుతోపాటు సాంకేతిక చెల్లింపులు

మద్యం దుకాణాలకు సంబంధించిన అనుమతి గడువు బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో అనుమతిదారులు సరకు తెచ్చుకున్న వెంటనే అమ్ముకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం సాంకేతికతో పాటు నగదు చెల్లింపుల ద్వారా మద్యం విక్రయించే అవకాశం కల్పిస్తున్నారు. అతి త్వరలోనే పూర్తిస్థాయిలో పాత బ్రాండ్లను మద్యం దుకాణాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇదివరకే పలు బ్రాండ్లు తీసుకొచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విక్రయించిన నాసిరకం బ్రాండ్లను పూర్తిస్థాయిలో తొలగించనున్నారు. పాలనాపరమైన అంశాలు పూర్తి చేసి 2019 సంవత్సరానికి ముందున్న బ్రాండ్లు తిరిగి తీసుకురానున్నారు. మొత్తం మీద ప్రభుత్వ మద్యం దుకాణాల శకం మంగళవారంతో ముగిసింది.

జీవీ మాల్‌లో బంపర్ డ్రా



కూపన్ చూపుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా కర్నూలు నగరంలోని జీవీ మాల్‌లో సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు 'నవరాత్రులు-జీవీ కానుకలు' సేల్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం బంపర్ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ హాజరై బంపర్‌డ్రాలో కూపన్ తీశారు. లక్కీ విన్నర్ జి.రాజు 'మారుతి వ్యాగనార్' కారు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు రమేష్, సాయిరాం, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అన్నీ అక్రమాలే

● పల్లె పండుగలో గళం విప్పిన జనం



బసాపురంలో మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, కూలి గిట్టుబాటు కావడం లేదని ఆదోని మండలం బసాపురం గ్రామంలో మంగళవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామస్థులు ఎమ్మెల్యే పార్థసారథికి వివరించారు. ఉపాధి పనుల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, కూలి మరీ రూ.40, రూ.62 చెల్లించారని గ్రామస్థులు వాపోయారు. కొంత మంది పనికి రాకున్నా.. వచ్చినట్లు హాజరు వేస్తున్నారని, దీంతో నిజమైన కూలీలకు అన్యాయం జరుగుతోందని గ్రామానికి చెందిన శేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మూడు నెలల పాటు భార్యాభర్తలు పనిచేసిన రూ.1200 జమైందని గ్రామానికి చెందిన సలవప్ప వాపోయారు. గ్రామసభలో ఉపాధి కూలీలు గళం విప్పారు. ఇందుకు ఎమ్మెల్యే పార్థసారథి స్పందిస్తూ.. ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుంకేసుల నుంచి 65,170 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గింది. మంగళవారం నాటికి 65,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. సోమవారం 86,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఒక్క రోజులోనే 21,050 క్యూసెక్కుల ప్రవాహం తగ్గినట్లు ఆయన పేర్కొన్నారు. 15 గేట్లు ఎత్తి దిగువకు 65,170 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

ఆర్‌యూ రిజిస్ట్రార్‌గా విజయ్‌కుమార్ నాయుడు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా యోగి వేమన వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్ నాయుడు నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా ఏడాది వరకు డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అడిషనల్ డీఎంఈ పదోన్నతులకు 50 మందితో జాబితా

● సర్వజన ఆస్పత్రి పర్యవేక్షకుడికి పదవీ గండం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : అడిషనల్ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పదోన్నతులకు సంబంధించి కర్నూలు వైద్య కళాశాల నుంచి సీనియారిటీవారీగా 50 మందితో జాబితా పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ జాబితాలో కర్నూలు సర్వజన వైద్యశాల పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి పేరు లేదు. ఆయనకంటే సీనియర్లతో కూడిన జాబితాను ప్రభుత్వానికి పంపారు. ఈ నేపథ్యంలో ఆయనకు పదవీ గండం తప్పదని ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటే పదోన్నతి రూపంలో పర్యవేక్షకులుగా ఇతరులు వస్తారన్న ప్రచారం ఉంది. ప్రస్తుత పర్యవేక్షణాధికారి వైకాపా ఆస్థాన కవిగా ముద్ర వేసుకున్నారు. గతంలో ఆయన జగన్‌ను పొగుడుతూ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు వివాదాస్పదమయ్యాయి.

ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్

బేతంచెర్ల న్యూస్‌టుడే : బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను సందర్శించడంతో పాటుగా పలు రకాల రికార్డులను పరిశీలించారు.

కళలు అల్లుకుని.. భవిష్యత్తు అందుకోవాలని

● స్వయం ఉపాధిలో మెలకువలు

పుస్తకాల్లోని పాఠాలే కాదు.. భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకునేలా కళలపై దృష్టిసారిస్తోంది ప్రభుత్వం. స్వయం ఉపాధికి అవసరమైన అల్లికలు, ఎంబ్రాయిడరీ, ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో రాణించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ పథకం కింద విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఏఐఎస్ఈసీటీ సంస్థకు చెందిన శిక్షకులు మెలకువలు నేర్పుతున్నారు. - న్యూస్‌టుడే, ఆదోని విద్య



ఆదోనిలో కుట్లు, అల్లికలపై విద్యార్థినులకు శిక్షణ

జీవితంలో స్థిరపడేలా..

ఆదోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినుల కోసం కేంద్ర ప్రభుత్వం స్వయం ఉపాధికి అవసరమైన ఎంబ్రాయిడరీ, మిషన్ కుట్టుట, అల్లికలు, ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఈ నెల 3వ తేదీన ఆదోని పట్టణంలో విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. ఏఐఎస్ఈసీటీ సంస్థ శిక్షకులు విద్యార్థినులకు మెలకువలు నేర్పుతున్నారు. ప్రధానంగా ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుకు సంబంధించి పలు అంశాలను ప్రయోగాత్మకంగా నేర్పుతున్నారు. ఈ కోర్సుల్లో రాణించడం, స్వయం ఉపాధి వైపు ఎలా అడుగులు వేయాలి? తదితర అంశాలపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. స్వయం ఉపాధితో తమ కాళ్లపై తామే నిలబడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం - వెంకటగౌరి, శిక్షకురాలు



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు స్వయం ఉపాధిపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. అల్లికలు, మిషన్ కుట్టడం, మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ తదితర వాటిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు స్వయం ఉపాధి వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై విద్యార్థినులకు వివరిస్తున్నాం. ఒక్కో విద్యార్థినికి శిక్షణ కాలంలో రూ.500 నుంచి రూ.వేయి వరకు ప్రోత్సాహక భృతి అందిస్తున్నాం. చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. చదువుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

ఈ కోర్సు ఎంతో ఉపయోగకరం - గీతక, పదో తరగతి, ఆదోని



ఉపాధిపై శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది. అందరూ ఉద్యోగాల కోసం చూడకుండా.. ఇలాంటివి నేర్చుకుంటే స్వయం ఉపాధి వైపు అడుగులేయవచ్చు. దసరా పండగ సెలవుల్లో ఎక్కువ సమయం కేటాయించాను. ఫ్యాషన్ డిజైనింగ్, అల్లికల్లో మెలకువలు నేర్చుకున్నా. ఇంట్లో ప్రయోగాలు కూడా చేశా. నేను చేసిన కొన్ని అల్లికలు అమ్మానాన్నకు చూపించా. వారు కూడా శిక్షణతో ప్రయోజనం ఉందనే అభిప్రాయానికి వచ్చారు. భవిష్యత్తులో ఉపయోగపడుతుందని ప్రోత్సహిస్తున్నారు.

అండగా ఉంటుందని - వర్షిత, విద్యార్థిని, ఆదోని



శిక్షకులు చెప్పే అంశాలు జీవితంలో అండగా ఉంటాయనేది అభిప్రాయం. స్వయం ఉపాధి కోర్సు భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వాస్తవానికి ప్రస్తుతం దుస్తులు కుట్టడం, ఫ్యాషన్ డిజైనింగ్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అలాంటిది ప్రభుత్వం ఉచితంగా నేర్పుతుండటం మాకు దక్కిన అవకాశం. శిక్షణ సమాచారం తెలిసిన వెంటనే వచ్చి చేరాం. భవిష్యత్తులో మంచి ఉద్యోగం రాకపోయినా.. భయపడకుండా ఇలాంటి స్వయం ఉపాధి కోర్సులో రాణిస్తే ఆదాయ మార్గం ఉంటుంది. విద్యార్థినులకు ఉపయోగకరం.

బదిలీ ఉత్తర్వులపై ఉత్కంఠ

● పోలీసు శాఖలో త్వరలో 130కి స్థానచలనం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : పోలీసు శాఖలో బదిలీ ఉత్తర్వులపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు స్థానచలనం కలిగించనున్నారు. బదిలీలకు సంబంధించి దాదాపు 130 మంది అర్హులుగా ఉన్నట్లు గుర్తించి జాబితా సిద్ధం చేశారు. కర్నూలు సబ్ డివిజన్‌లోనే అత్యధికంగా 55 మంది ఉన్నట్లు తెలిసింది. జిల్లాలోని నలుగురు డీఎస్పీలతో కలిసి బదిలీలపై ఎస్పీ జి.బిందుమాధవ్ ఇటీవల కసరత్తు చేశారు. ఎవరెవరిని ఎక్కడికి బదిలీ చేయాలన్న అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. త్వరలో బదిలీల ఉత్తర్వులు వెలువడుతాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆరోపణలున్నా కీలక బాధ్యతలు

పోలీసు శాఖకు కళ్లు, చెవుల్లా పని చేసే స్పెషల్ బ్రాంచి విభాగంపై రాజకీయ జోక్యం పెరిగింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫారసు పత్రాలతోనే ఆయా పోలీసుస్టేషన్లకు సీఐలు, ఎస్సైలను కేటాయిస్తుండటం ఎప్పటినుంచో కొనసాగుతున్న సంప్రదాయం. ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు కేటాయించే విషయంలో అదే పరంపర కొనసాగుతోంది. అధికార పార్టీ నేతలు తమ పరిధిలో స్పెషల్ బ్రాంచి విభాగం నుంచి ఎవరిని నియమించాలో వారే ఎంపిక చేసుకుని సిఫారసు పత్రాలు జారీ చేస్తున్నారు. స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తూ గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురికి ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకు మళ్లీ కీలక బాధ్యతలు అప్పగించారు. మరికొందరికి స్థానచలనం కలిగించి స్థానాలు సర్దుబాటు చేశారు. కొందరిని ముఖ్య బాధ్యతల నుంచి తప్పించారు. స్పెషల్ బ్రాంచి విభాగంపై రాజకీయ ప్రభావం తీవ్రమవడం చర్చనీయాంశంగా మారింది.

వాల్మీకి మహర్షి జయంతిని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి, పక్కన సోమిశెట్టి, సత్రం రామకృష్ణుడు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17న అధికారికంగా నిర్వహించనున్న వాల్మీకి మహర్షి జయంతిని విజయవంతం చేయాలని కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడుతో కలిసి మంగళవారం మాట్లాడారు. 17వ తేదీ ఉదయం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వాల్మీకి మహర్షి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పారు. మంత్రి టీజీ భరత్‌తోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరు కానున్నారని, జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ పేరుతో రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువలు, వీధిదీపాలు వంటి కనీస సదుపాయాల కల్పించేందుకు కూటమి ప్రభుత్వం వారం రోజులపాటు గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని జొహరాపురం ఇందిరమ్మ గృహ సముదాయ కాలనీలో నీటి సంపులో పడి అయాన్‌వలీ (6) అనే బాలుడు మృతి చెందారు. కర్నూలు మండలం దిగువపాడుకు చెందిన కాశింవలీ సదరు కాలనీలో ఇల్లు నిర్మించుకున్నారు. సెప్టిక్ ట్యాంకు కోసం తీసిన గుంతను ప్రస్తుతం నీటి సంపుగా వినియోగించుకుంటున్నారు. కాశింవలీ కుటుంబసభ్యులు సోమవారం పనిలో నిమగ్నమై ఉండగా అయాన్‌వలీ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన వారు కొన ఊపిరితో ఉన్న బాలుడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కర్నూలు ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెదేపా నాయకుడిపై వైకాపా నాయకుల దాడి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం కె.నాగలాపురం గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు పూజారి చాకలి హనుమంతుపై అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకులు దాడి చేశారని బాధితుడు పేర్కొన్నారు. గ్రామంలోని నర్సప్ప దూత ఆలయ పూజారి హనుమంతు ఆలయ అభివృద్ధి కోసం ప్రజల నుంచి వసూలు చేసిన చందా మొత్తం రూ.50వేలు జమైంది. ఇందులోని రూ.25వేలు మాజీ సర్పంచి వీరారెడ్డి బోరు మరమ్మతుల కోసం తీసుకున్నారన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ విషయంలో గ్రామంలోని చావిడి వద్ద అడగగా.. తనపై జనార్దన్, ప్రహ్లాద, చిన్నవీరేశ్, మహేశ్ తదితరులు దాడి చేశారని వాపోయారు. చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ఆదోనిలో కబ్జా మాట వినిపించకుండా చేస్తా

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో కబ్జా అనే మాట వినిపించకుండా చేస్తానని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 352 సర్వే సంఖ్య బాధితులు ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. 2008లో నెలవారీ కంతులు చెల్లించి సెంటున్నర లెక్కన ప్లాట్లు కొనుగోలు చేశామని బాధితులు పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అనుచరులైన అక్కర్తి రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు తమ వద్దకు వచ్చి మీ ప్లాట్లు రూ.1.55 లక్షలకు తమకు ఇవ్వాలని కోరడంతో తాము నిరాకరించామన్నారు. దీనిపై నాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే దీనిపై అధికారులతో విచారణ చేయించి న్యాయం చేస్తానన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పొల్పడకుండా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షులు నీలకంఠ, జనసేన బాధ్యుడు మల్లప్ప, దేశాయి చంద్రన్న, ఉపేంద్రకుమార్, నాగరాజుగౌడ్ తదితరులున్నారు.


వేరుశనగ ధరలు పతనం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ దిగుబడుల ధరలు రోజు రోజుకు పతనమవుతున్నాయి. మంగళవారం 7,851 సంచుల మేర వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటాలు కనిష్ఠంగా రూ.3,305, గరిష్ఠంగా రూ.6,776, మధ్య ధర రూ.6,429 పలికాయి. ఈ నెల 14న గరిష్ఠ ధర రూ.6,800, 9న రూ.7,093, 8న రూ.7,289, 7న రూ.7,240, 1న రూ.7,263 పలికాయి. ఆరంభంలో రూ.7,600 ధర పలికింది. ధర తగ్గిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సరుకు నాణ్యత లేకపోవడం, తేమ శాతం ఉండటం వల్ల ధర తగ్గుముఖం పట్టిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావమేనంటున్నారు.

మళ్లీ పెరిగిన టమాటా ధరలు

పత్తికొండ మార్కెట్లో మంగళవారం ధరలు మళ్లీ పెరిగాయి. 753 క్వింటాళ్ల సరుకు మార్కెట్‌కు వచ్చింది. క్వింటా గరిష్ఠ ధర రూ.4వేలకు పైగానే పలికింది. రెండు రోజులుగా రూ.2,500 పలికిన ధరలు మళ్లీ పుంజుకోవటంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దసరా పండగ తర్వాత సరుకు దిగుబడి భారీ స్థాయిలో పెరిగినట్లు యార్డు అధికారులు వెల్లడించారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం



ఆలూరు దారి.. ఆనవాళ్లు చెదిరి

ఆలూరు- కర్నూలు ప్రధాన రహదారి ఇది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఈ దారంతా చెదిరి గోతుల మయంగా మారి ఆనవాళ్లు కోల్పోయింది. భారీ గోతులు ప్రయాణికులను భయపెడుతున్నాయి. పలుచోట్ల మట్టిదారిగా మారింది. వైకాపా ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని గాలికొదిలేయడంతో ఇప్పుడు కనీసం దారి రూపురేఖలు లేకుండా పోయింది. రహదారులకు నిధులు కేటాయించి బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం



నిలువునా వదిలేశారు

మద్దికెరలో నీటిపథకాల నిర్వహణ విషయంలో సంబంధిత పంచాయతీ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రహదారులపై, ప్రధాన కూడళ్లలో నీటి వాల్వ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాటికి సంబంధించిన పైపులు రహదారికి రెండు అడుగుల ఎత్తులో ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మద్దికెర



మేమున్నాం.. మీకు తోడుగా..

వసతులు లేక సతమతమవుతున్నారా!

మీ కాలనీలో తాగునీరు సరిగా సరఫరా కావడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదా? వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతోందా. తాగునీటి పైపులైన్ లీకవుతోందా? కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందా? శివారు కాలనీల సమస్యలు పట్టించుకోవడం లేదా? ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారా? వీటి పరిష్కారానికి 'ఈనాడు-మేమున్నాం.. మీకు తోడుగా' వేదికగా పురపాలక కమిషనర్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు తెలపండి. అవి పరిష్కారమయ్యేలా చూస్తాం. ఇంకెందుకు ఆలస్యం. వెంటనే ఫోన్ చేసి సమస్య వివరించండి.

తేదీ: 17 (గురువారం)
సమయం: ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు
98499 05859

పల్లె కబుర్లు

బండపల్లి(దేవనకొండ), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసమే పల్లె పండగ కార్యక్రమం చేపట్టినట్లు కూటమి నాయకులు వెంకటస్వామి గౌడు, శ్రీనివాసులు, కిరణ్ పేర్కొన్నారు. బేతపల్లి, బండపల్లి, చెల్లెలచెలిమల గ్రామంలో భాగంగా సీసీ రహదారి. మినీ గోకులం తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సర్పంచులు మహేశ్వరరెడ్డి, రామప్ప, ఈవోఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఖాతాదారులకు, రైతు సోదరులకు ప్రవేశ పెట్టిన కర్షకవృద్ధి డిపాజిట్ పథకం ఎంతో మేలు చేస్తుందని మారెల్ల, జొన్నగిరి సహకార సంఘాల సీఈవోలు మనోహర్‌నాయుడు, గిడ్డయ్య అన్నారు. సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ ఇస్తున్న పథకం ఇదేనని ఈ పథకంలో చేరాలని వారు కోరారు.

ఆర్ఎస్ పెండేకల్లు (తుగ్గలి), న్యూస్‌టుడే: ఆర్ఎస్ పెండేకల్లు, రాంపల్లి, మారెల్ల తదితర గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీహరి, ఏపీవో హేమ సుందర్ సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తిరుపాల్‌నాయుడు, వీరేష్, వెంకటరాముడు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనపల్లి, (మద్దికెర), న్యూస్‌టుడే: బొమ్మనపల్లి గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సర్పంచి ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ప్రోత్సాహన్ని అందిపుచ్చుకుని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజునాథ, ఇంజినీరింగ్ సహాయకుడు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఆర్డీవో ఎస్. భరత్‌నాయక్ మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పత్తికొండ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని కలిసినట్లు ఆర్డీవో తెలిపారు.

మద్దికెర, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రెవెన్యూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. మద్దికెర తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అందనంత దూరం

■ అసంపూర్తిగా పార్కుల నిర్మాణం
■ నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పార్కు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి. ఇక్కడ లేఅవుట్ వేసే సమయంలో ఉద్యానవన అభివృద్ధి కోసం సుమారు 15-20 సెంట్ల స్థలం కేటాయించారు. రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని చాలా కాలం ఖాళీగా వదిలేశారు. దీనిపై వైకాపాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కబ్జాకు యత్నించారు. చివరకు బండలు పాతి, కబ్జా చేయడంతో ప్రజల ఫిర్యాదు చేశారు. అప్పటి కమిషనర్ సిబ్బందితో వెళ్లి బండలు తొలగించి, స్థలం స్వాధీనం చేసుకుని, పురపాలక స్థలంగా బోర్డు పాతారు.



ప్రహరీ పనులతోనే సరిపెట్టిన పార్కు

పోరాడి దక్కించుకున్నారు

కబ్జాకు గురైన స్థలాన్ని స్థానికులు పోరాడి దక్కించుకున్నారు. పార్కుగా మంజూరు చేయించుకున్నారు. 15వ ఆర్థిక సంఘం కింద రూ.30 లక్షలు, కుడా కింద మరో రూ.25 లక్షలు మంజూరయ్యాయి. గతేడాది రూ.30 లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. రూ.20 లక్షల విలువైన పనులు చేసిన గుత్తేదారు బిల్లు తీసుకుని పనులు ఆపేశాడు. ప్రస్తుతం ప్రహరీ సీసీ ప్లాస్టింగ్, రంగులు వేయాల్సి ఉంది. కుడా ద్వారా రూ.25 లక్షలతో పార్కు లోపలి భాగంలో పచ్చిక బయలు, ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్ నిర్మించాలి. కనీస పనులు చేపట్టకపోవడంతో కుడా పనులు రద్దయ్యాయి. ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. పార్క్ లోపలి భాగంలో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు పెరిగాయి. పాత గుత్తేదారుతో నైనా పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



హౌసింగ్‌బోర్డు కాలనీలో విరిగిన ఆట వస్తువులు

నిర్వహణ మరిచారు

ఇప్పటికే హౌసింగ్‌బోర్డులో నిర్మించిన పార్కుల నిర్వహణ అధ్వానంగా మారింది. అమృత్ పథకంలో భాగంగా 2014-19 మధ్య కాలంలో రూ.50 లక్షల వ్యయంతో రెండు పార్కులు నిర్మించారు. కొన్ని పార్కుల్లో పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడాసామగ్రి ధ్వంసమైంది. ఇందులోనే నీటి మోటారు ఎత్తుకెళ్లారు. రాంజల రహదారిలోని పాత పార్కులో క్రీడా వస్తువులు పూర్తిగా పాడయ్యాయి. పార్కు స్థలాల అభివృద్ధిపై దృష్టిసారించడం లేదని పట్టణ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వెనుకబడిపోతున్నాం..

– గోపాలకృష్ణ, విశ్రాంత సైనికులు.



ఆదోనికి ఎంతో చరిత్ర ఉంది. ఇంతటి పెద్ద పట్టణంలో ప్రజలకు కనీసం పార్కులు సరిగ్గా లేవు. ఉన్న వాటిని సవ్యంగా నిర్వహించడం లేదు. మనకంటే వెనుకబడిన పురపాలికలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. మనం మాత్రం వెనుకబడిపోతున్నాం. మారిన జీవనశైలికి, తగ్గట్లు ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇందుకు పార్కులు ఎంతో కొంత ఉపయోగపడతాయి. ఇప్పటికైనా వీటిపై దృష్టి సారిస్తే మేలు.

ఆక్రమణకు గురికాకుండా చూడాలి

– చంద్రశేఖర్, ఆదోని



ఆదోని పట్టణంలో విలువైన స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడాలి. ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని ఉద్యానవనాలుగా అభివృద్ధి చేయాలి. ప్రజల అవసరాలకు తగ్గట్లు పార్కులు నిర్మించాలి. వీటిలో ఆట, క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే విలువైన స్థలాలు కనుమరుగయ్యాయి. ఉన్న వాటిని కాపాడుకుంటే భావితరాల అవసరాలకు, ఆహ్లాదం పంచేందుకు ఉపయోగపడతాయి. అభివృద్ధిలో చాలా వెనుకబడ్డాం. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందనే నమ్మకం ఉంది.

రుణభారం.. బాధ్యతల భయం



లక్ష్మన్న (పాత చిత్రం)

జీవన గమనంలో అప్పులు పేరుకుపోయాయి.. బాధ్యతలు భయపెట్టాయి.. ఓ మధ్యతరగతి తండ్రిని కష్టాలు చుట్టుముట్టాయి.. ఆ గుండె తట్టుకోలేకపోయింది.. మోయలేని భారం కుంగదీసింది.. ఆందోళన వెంటాడింది.. ఉరే సరైందనుకున్నారు. . కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయారు ఓ నిరుపేద తండ్రి.

– న్యూస్‌టుడే, ఆస్పరి, ఆదోని నేరవార్తలు

ఓ వైపు అప్పుల బాధ.. మరో వైపు కుమార్తెల పెళ్లిళ్లు ఎలా చేయాలనే వేదనతో ఓ నిరుపేద తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పరి మండలం హలిగేర గ్రామానికి చెందిన లక్ష్మన్న(45)కు భార్య పార్వతి, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులిద్దరూ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇద్దరు కుమార్తెల పెళ్లి కూడా చేశారు. సుమారు రూ.10లక్షల అప్పులయ్యాయి. ఓ వైపు అప్పుల భారం.. మరోవైపు ఇద్దరు కుమార్తెలు పెళ్లిళ్లు ఎలా చేయాలనే వేదనతో వెంటాడాయి. మనోవేదనకు గురైన ఆ తండ్రి చేసేదిలేక ఇంటి ముందున్న చెట్టుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబానికి తీరని వేదన మిగిల్చారు. విషయం తెలుసుకున్న సీఐ మస్తాన్‌వలి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు. మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచి లింగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రహింతుల్లా కోరారు.

అభివృద్ధి పథంలో నడిపిద్దాం

టి.గోకులపాడు, తొగర్చేడు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయత్వంలోని కూటమి ప్రభుత్వంలో పత్తికొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. జనసేన బాధ్యుడు రాజశేఖర్‌తో కలిసి మంగళవారం కృష్ణగిరి మండలం టి. గోకులపాడు, తొగర్చేడు, రామకృష్ణాపురం, ఎరుకలచెరువు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీసీ దారులు, మురుగు కాల్వల పనులకు భూమిపూజ చేశారు. టి. గోకులపాడులో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు రామాంజనేయులు, రేణుకమ్మ, వరలక్ష్మి, ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి, ఎంపీడీవో మోహన్‌కుమార్, పీఆర్ ఏఈ జాకీర్ హుసేన్, తెదేపా నాయకులు నబిసాహెబ్, దామోదర్‌నాయుడు, ఎల్వీ ప్రసాద్, గురుస్వామి,రఫీ, నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.



టి.గోకులపాడులో మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి

ఆస్పరి, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఆలూరు నియోజకవర్గ తెదేపా నాయకుడు వీరభద్రగౌడ్ అన్నారు. మండలంలోని బిణిగేర, జొహరాపురం గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాజపా నాయకులు వెంకటరాముడు, పరమారెడ్డి, శేషాద్రినాయుడు, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు సాలీసాహెబ్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి నెల్లురప్ప, కార్యదర్శి జంప్లానాయక్, తెదేపా మండల మాజీ కన్వీనర్ శ్రీనివాసగౌడ్, నాయకులు ఉచ్చీరప్ప, ఈరన్న, మల్లికార్జునరెడ్డి, రంగస్వామి, ప్రభాకర్, సతీష్‌కుమార్, హనుమంతరెడ్డి, బసవరాజ్, మధు, శివకుమార్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.



బిణిగేరిలో భూమిపూజ చేస్తున్న వీరభద్రగౌడ్, తదితరులు

పల్లెల అభివృద్ధికి ప్రణాళిక

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మండలం బసాపురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి పర్యటించారు. వీధుల్లో తిరిగి సమస్యలపై ఆరా తీశారు. సిమెంటు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తెదేపా సానుభూతిపరులకు గత ప్రభుత్వం అన్ని పథకాల్లో అన్యాయం చేసిందని తెదేపా నాయకుడు రామస్వామి తెలిపారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తమకు పట్టాలు మంజూరు చేయలేదని గుడిసె ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీడీ లోకేష్, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, జనసేన బాధ్యుడు మల్లప్ప, తెదేపా నాయకులు రామస్వామి, గుడిసె ఆది కృష్ణమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మీ సలీం, దేవేంద్రప్ప, ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



బసాపురంలో మురుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

చెకుముకి పోటీలో ప్రతిభ

దొడ్డనగేరి(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరచిన దొడ్డనగేరి జడ్పీ పాఠశాల విద్యార్థులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీలో అజయ్, వినయ్ గౌడ్, నరసింహులు, ధనుష్, నందు ప్రియలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందించి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దొడ్డనగేరి జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెదేపా సీనియర్ నాయకుడి మృతికి సంతాపం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మండల తెదేపా సీనియర్ నాయకుడు బొమ్మన శివశంకరరెడ్డి(70) మృతికి పత్తికొండ, డోన్ ఎమ్మెల్యేలు కేఈ. శ్యాంబాబు, కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గ తెదేపా నాయకులు గౌరు వెంకటరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి సంతాపం తెలిపారు. కేఈ. శ్యాంబాబు అంత్యక్రియలకు హాజరై పాడె మోశారు. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలారు.



నివాళి అర్పిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి

వ్యాసరచన పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక

ఆదోని విద్య, న్యూస్‌టుడే: కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి అబ్దుల్ ఖలీక్ స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున తెలిపారు. అధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.



ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునతో విద్యార్థి ఖలీక్

సమాచారం ఇవ్వలేదని కమిషనర్‌తో వాగ్వాదం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులో టిడ్కో నివాసాల్లో లబ్ధిదారుల గృహప్రవేశాల అంశంపై తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని వైకాపా వార్డు కౌన్సిలర్లు మంగళవారం పురపాలక సంఘం కమిషనర్ కృష్ణతో వాగ్వాదానికి దిగారు. తాము వార్డు కౌన్సిలర్లమని, తమకు సమాచారమందిస్తే, వార్డులో తాము కూడా ప్రజలకు చెబుతామన్నారు. పత్రికాముఖంగా ప్రకటన ఇచ్చామని కమిషనర్ గుర్తు చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వైస్‌ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీయాదవ్, సందీప్‌రెడ్డి, చలపతి, ఫయాజ్‌అహ్మద్, ఇంతియాజ్, కిషోర్, ఇబ్రహీం తదితరులున్నారు.

19వ వార్డు సచివాలయం తనిఖీ

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని 19వ వార్డు సచివాలయాని పురపాలక కమిషనర్ కృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో దస్త్రాలతో పాటు గ్రీవెన్స్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధుల పట్ల బాధ్యతతో ఉండాలని, సకాలంలో విధులకు రావాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం


ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఆలూరు మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని తాగునీరు, వ్యవసాయ, విద్యుత్తు, గృహ, రెవెన్యూ వంటి అన్నిశాఖల చర్చకొనసాగుతుందని చెప్పారు.

ఆదర్శ పాఠశాల నిర్మించాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండలంలో 44 గ్రామాలు ఉన్నాయని విద్యారంగంలో పూర్తిగా వెనుకబడిందని ఎంపీటీసీ మాజీ సభ్యుడు నరసారావు పేర్కొన్నారు. మండలంలో ఆదర్శ పాఠశాల, బీసీ వసతిగృహాలు ఏర్పాటు చేయాలని ఎంపీ నాగరాజుకు కర్నూలులో వినతి పత్రం అందజేశారు.

అన్నగారి ఇళ్లకు బిల్లుల చెల్లింపు

◆ పేదలపై తగ్గనున్న భారం
◆ ఎన్టీఆర్ గృహలబ్ధిదారులకు ప్రయోజనం



ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల కల.. సొంత ఇల్లు. వారి స్వప్నం నెరవేర్చాలనే లక్ష్యంతో గతంలో తెదేపా ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. వేలాది గృహాలు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి ఓసీ, బీసీ వర్గాలకు రూ.1.50 లక్షలు, ఎస్సీ వర్గానికైతే రూ.2 లక్షలు, ఎస్టీలకు రూ.2.25 లక్షల చొప్పున నిధులు కేటాయించింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా అప్పట్లో నిర్మించుకున్న గృహాలకు బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు బిల్లులు కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లడిగేలా తిరిగినా.. పాలకులు కనికరించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు బిల్లులు విడుదల చేయాలని నిర్ణయించింది.

పరిశీలిస్తున్న అధికారులు

ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద, దేవనకొండ మండలాల పరిధిలో ఎన్టీఆర్ గృహాలు ఉన్నాయి. గతంలో తెదేపా ప్రభుత్వంలో నిర్మించుకుని వైకాపా హయాంలో నిలిచిపోయిన ఇళ్ల స్థితిగతులపై ఆయా శాఖల అధికారులు ఆరా తీస్తున్నారు. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలు అంతర్జాలంలో నమోదు చేస్తున్నారు. కొందరు అప్పు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారని, మరి కొందరు మధ్యలోనే నిలిపివేసి అద్దె భవనాల్లో ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. లబ్ధిదారులందరికీ త్వరలోనే బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు.

సర్వే పూర్తవుతోంది – ఆదినారాయణ, గృహ నిర్మాణ శాఖ, డీఈఈ ఆలూరు

ప్రస్తుతం ఎన్టీఆర్ గృహాల సర్వే నిర్వహిస్తున్నాం. లబ్ధిదారుడి ఇంటి దగ్గరకు వెళ్లి చిత్రాలు, లబ్ధిదారుల ఖాతాల వివరాలు చిత్రాలు తీసి పంపుతున్నాం. ప్రభుత్వం ఆ ఇంటి నిర్మాణాల స్టేజ్‌లను బట్టి వారికి బిల్లులు మంజూరు చేస్తుంది. సర్వే పూర్తి కావచ్చింది. లబ్ధిదారులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ప్రభుత్వం అందరికీ న్యాయం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

నేరాల నియంత్రణకు చర్యలు

ఆదోని గ్రామీణం న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. పెద్దతుంబళం, ఇస్వీ, ఆదోని తాలుకా పోలీసు స్టేషన్, ఆదోని రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆదోని డీఎస్పీ సోమన్న, సీఐలు ప్రసాద్, గుణశేఖర్ బాబు, నల్లప్ప, పెద్దతుంబళం, ఇస్వీ, తాలుకా ఎస్సైలు మహేష్‌కుమార్, నాగేంద్ర, రామాంజనేయులు, స్పెషల్‌బ్రాంచ్ ఎస్సై వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలనే అంశాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ అన్నారు. పత్తికొండలో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లాస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు సుభాష్‌చంద్ర మాదిగ, రెడ్డిపోగు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుడ్డు రామకృష్ణ

అవిశ్రాంత పరిశోధనకుడు కలాం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: జీవించినంత కాలం విశ్రాంతి లేకుండా పరిశోధనలు సాగించిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అని ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక సత్యసాయి పాఠశాలలో మంగళవారం కలాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు రమణయాదవ్, సిబ్బంది గఫూర్, ప్రభాకర్, తిప్పారెడ్డి, రఘు, నూర్‌బాషా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



అమ్మవారికి వెండి కానుక బహూకరణ

కె.నాగలాపురం (గూడూరు) న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురం సుంకులమ్మ అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన శివయ్య, సుజాత దంపతులు వెండి వస్తువులను బహూకరించారు. మంగళవారం వారు ఆలయానికి వచ్చి 2.140 కిలోల రెండు పళ్లాలు, ప్రసాదం గిన్నె, దీపాలు ఆలయ అర్చకుడు కేశవ్‌కు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

← వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

చేతుల పరిశుభ్రత తప్పనిసరి

చనుగొండ్ల (గూడూరు), న్యూస్‌టుడే: చేతుల పరిశుభ్రత తప్పనిసరి అని జల్‌జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం సమన్వయకర్త డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని చనుగొండ్ల జడ్పీ పాఠశాలలో ప్రపంచ చేతుల శుభ్రత దినం సందర్భంగా అవగాహన కల్పించారు. చేతుల శుభ్రతకు ఎనిమిది పద్ధతులను చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

నందవరం: **సమస్య:** మండలంలోని నందవరం ఎస్సీ కాలనీలో కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో మురుగు ముందుకు పారడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయగలరు. **- మోహన్**

సమాధానం: కాల్వలను శుభ్రం చేయిస్తాం. ఇంకా ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలి.
- పుల్లయ్య, ఎంపీడీవో

విద్యార్థులు సమాజ నిర్మాతలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: విద్యార్థులు భవిష్యత్తులో సమసమాజ నిర్మాతలని ప్రముఖ మానసిక తత్వవేత్త, మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మనమడు రాధాకృష్ణారావు అన్నారు. మంగళవారం మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హంపయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలంటే పండగలా ఉండాలని, భయాన్ని వీడాలన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మాణమవుతుందన్నారు. జీవితంలో కష్టాలను తట్టుకొని ఎదగాలని సూచించారు.



మాట్లాడుతున్న మానసిక తత్వవేత్త రాధాకృష్ణారావు

రవాణా వ్యయం.. నిర్మాణ భారం

★ ట్రాక్టర్ ఇసుకకు రూ.6 వేలకుపైగా అమ్మకం



నాగలదిన్నె వద్ద తుంగభద్ర నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

నిఘా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఒకవైపు ఇసుకను ఉచితంగా అందించేందుకు కృషి చేస్తుండగా, మరోవైపు అక్రమార్కులు లబ్ధిదారులకు బహిరంగా ఇష్టారీతిన ధర పెంచి విక్రయిస్తున్నారు. గృహ, ఇతర నిర్మాణరంగంపై భారం పడుతోంది. దీంతో సొంత నిర్మాణాలు చేపడుతున్నవారు లబోదిబోమంటున్నారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో తుంగభద్ర నది పరివాహక ప్రాంతమున్నా ఇసుక రీచ్‌లను గుర్తించలేదు. డంప్‌ల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో రాజకీయ అండతో అనధికారికంగా వంకలు, వాగులతోపాటు నందవరం మండలంలోని నాగలదిన్నె వద్ద తుంగభద్ర నదిలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఉచిత ఇసుక నేపథ్యంలో ట్రాక్టర్ ఇసుక రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అందుతుందని గృహ, వాణిజ్య దుకాణాల నిర్మాణాలు, వివిధ పథకాల కింద చేపడుతున్న నిర్మాణదారులు ఆశించారు. ఇసుక మాఫియా కారణంగా ట్రాక్టర్ రూ.5 వేల నుంచి రూ.6 వేలకుపైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నాగలదిన్నె వద్ద తుంగభద్ర నదిలో నుంచి కొద్ది రోజుల పాటు రోజూ సుమారు 40 ట్రాక్టర్ల ద్వారా ఇసుక తవ్వి తరలించారు. ప్రస్తుతం పేరుకే ఉచిత ఇసుక తప్పా ధర ఏ మాత్రం తగ్గలేదని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు వస్తారని నిలిపివేత

ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం తెలుసుకున్న గనులు, పోలీసుల శాఖ అధికారులు తుంగభద్ర నదిలో తనిఖీ చేశారు. ఈ సమాచారం ముందే తెలియడంతో అక్రమార్కులు అటువైపు వెళ్లకుండా ఉండిపోయారు. తుంగభద్ర నదిలో అక్రమంగా తవ్వి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో తరలిస్తున్న క్రమంలో అధికారుల తనిఖీ సమయంలో మాత్రం నిలిపివేశారు. దీంతో అధికారులు తనిఖీ చేసి ఇసుక అక్రమ తవ్వకాలు లేవని గుర్తించడం గమనార్హం.

ధర దిగి వచ్చేనా?

వైకాపా ప్రభుత్వ హయంలో ఇసుక మాఫియాతో ఇష్టానుసారంగా అక్రమ తవ్వకాలతోపాటు ధర పెరిగి బంగారంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. దీంతో ఇసుక ధర తగ్గుతుందని గృహ నిర్మాణదారులతోపాటు ఇతర రంగాలవారు ఆనందించారు. అయినా గతంలోలాగే ధర మండిపోతుండటంతో పేరుకే ఉచిత ఇసుకంటూ ధర ఏమాత్రం తగ్గలేదని నిర్మాణ రంగాల లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి ధరను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

కల్లుకుంటను సందర్శించిన జిల్లా ఎస్పీ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లుకుంట గ్రామాన్ని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం సందర్శించారు. గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మను



గోవిందమ్మతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

ఆయన పరామర్శించారు. ఆమెకు న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. తనపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని బాధితురాలు గోవిందమ్మ ఎస్పీని కోరగా 164 యాక్టు కింద న్యాయం చేయడానికి బాధితురాలిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలని డీఎస్పీ ఉపేంద్రబాబును ఆదేశించారు. బందోబస్తు నేపథ్యంలో 24 గంటలు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. సీఐలు విక్రమ్‌సింహా, మంజునాథ్, ఎస్‌బీ సీఐ ప్రసాద్, ఎస్సైలు నిరంజన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మహేశ్‌కుమార్ ఉన్నారు.

నేరసమాచారం

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్నూలు-బళ్లారి రహదారిపై ఎస్‌ఆర్ పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం రాత్రి ఓ వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై వీటీ ఆశలత పేర్కొన్నారు. మృతుడికి సంబంధించినవారు లేకపోవడంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ మార్చురీకి తరలించామన్నారు. లేత గులాబీ రంగు టీ షర్ట్, నలుపు, తెలుపు గీతల ప్యాంటు ధరించి, కుడి చేయిపై హరిత లవ్ అనే పచ్చబొట్టు ఉందన్నారు. వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ యువతి..

కోసిగి, న్యూస్‌టుడే: పెళ్లి సంబంధాలు రావడం లేదని, ఇతర కారణాలతో మనస్తాపానికి గురై ఓ యువతి మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


పురుగు మందు తాగి యువ రైతు ఆత్మహత్యాయత్నం

కోసిగి, న్యూస్‌టుడే: రూ.లక్షలు అప్పులు తెచ్చి మిరప పంట సాగు చేస్తే వైరసి వచ్చి పంట నష్టం వచ్చిందనే బాధతో మనస్తాపానికి చెందిన హనుమేశ్ అనే యువ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని అగసనూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. హనుమేశ్ గ్రామంలో తనకున్న నాలుగెకరాల పొలంలో మిరప సాగు చేశారు. వైరస్ సోకి పంటంతా నాశనమైందన్న బాధతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆదోని అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోసిగి, న్యూస్‌టుడే: కర్ణాటక మద్యం అక్రమంగా తరలించడం మానుకోవాలని ఎస్సై చంద్రమోహన్ అక్రమార్కులను హెచ్చరించారు. మంగళవారం ఆయన కోసిగిలో దాడులు నిర్వహించారు. కోసిగి మండలం సజ్జలగూడెంకు వెళ్లే రోడ్డు పక్కనున్న జగనన్న కాలనీ సమీపంలో కోసిగికి చెందిన వెంకటేశ్, తిక్కోడు అనే వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాల్లో 20 పెట్టెల కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఏఎస్సై నాగరాజు, రాంప్రతాప్ పాల్గొన్నారు.

కాలనీలో చిట్టడవి



వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు నిర్మిస్తామని ప్రగల్బాలు పలికి నీరుగార్చారు. కొంత మందికి పట్టాలు అందించినా ఎక్కడో గ్రామానికి దూరంగా స్థలాలు ఉండటంతో ఎవరూ ఆసక్తి చూపలేదు. కోసిగి మండలం సజ్జలగూడెం గ్రామానికి వెళ్లే దారిలో జగనన్న కాలనీలో సుమారు 700 పట్టాలు అందజేశారు. ఇక్కడ ఇల్లు నిర్మించుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కొందరు నిర్మించుకున్నా బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. దీంతో కాలనీలన్నీ ముళ్లచెట్లతో చిట్టడవిని తలపిస్తున్నాయి. **– న్యూస్‌టుడే, కోసిగి**

కండక్టర్ ఉన్నా.. బస్సు తుస్సు



గోనెగండ్లలో సింగిల్, టూ స్టాప్ బస్సుల నిలిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక కండక్టర్‌ను నియమించారు. అయితే అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ సింగిల్, టూ స్టాప్ బస్సు డ్రైవర్లు బస్సులను ఆపకుండా వెళ్తున్నారు. కండక్టర్‌ను నియమించినా ఎలాంటి ప్రయోజనం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి బస్సు కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు. **– న్యూస్‌టుడే, గోనెగండ్ల**

భూగర్భ జలాలు పడిపోకుండా చూడాలి

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలోని గుడికంబాలి, మరళి, నదిచాగి గ్రామాల్లో మంగళవారం జేసీ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పర్యావరణ, గనులు, రెవెన్యూ శాఖల అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. గుడికంబాలిలో ఉదయం 11:30 గంటలకు, మరళిలో మధ్యాహ్నం 1:30 గంటలకు, నదిచాగిలో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుడికంబాలిలో 10 హెక్టార్లలో లక్ష క్యూబిక్ మీటర్లు, మరళిలో 4.311 హెక్టార్లలో 43,110 క్యూబిక్ మీటర్లు, నదిచాగిలో 9.170 హెక్టార్లలో 91,700 క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వేందుకు జలవనరులు, గనులు, పర్యావరణ శాఖ అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు. రీచ్‌లున్న గ్రామాల్లో ఇసుక తవ్వకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆయా గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ నవ్య తెలిపారు. ఇసుక రీచ్‌కు వెళ్లే రహదారిని 2 కి.మీ. నిర్మించాలని గుడికంబాలి గ్రామస్థులు కోరారు. అంగన్‌వాడీ, సీసీ దారులు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక రీచ్ నుంచి వాహనాలను గ్రామాల్లోకి రాకుండా సరిహద్దుల్లో రవాణా చేయాలని మరళి, నదిచాగి గ్రామాల ప్రజలు కోరారు.



మాట్లాడుతున్న జేసీ నవ్య, పక్కన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం చిక్కమంగళూరుకు చెందిన పరమేశ్, నేత్రావతి దంపతులు రాఘవేంద్రస్వామి ఒకరోజు సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళాన్ని అందించినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి మంగళవారం తెలిపారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో-2 నీలకంఠ తెలిపారు. మంగళవారం ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన బాత్‌రూంలను శుభ్రం చేసే రసాయనాలను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని 56 పాఠశాలలకు 1,216 డబ్బాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాముడు, చంద్రశేఖర్, సీఆర్పీలు గోవిందు, పుల్లన్న, రవి పాల్గొన్నారు.

నేటి నుంచి రైతులకు శిక్షణ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్స్ కింద ఉమ్మడి జిల్లాలోని రైతులకు బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నట్లు మంగళవారం కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థల ఆధ్వర్యంలో రెండు వారాలపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం సహించేది లేదు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఇంటి, కుళాయి, ఇతర పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం సహించేది లేదని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పురపాలకలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వార్డుల్లో పర్యటించి పాత బకాయిదారుల వద్ద వసూలు చేయాలన్నారు. పట్టణంలో మొండి బకాయిలు చాలా ఉన్నాయని, దీంతో పురపాలక ఆదాయానికి గండి పడుతోందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోసిగి, న్యూస్‌టుడే: ఆర్డీఎస్ సమీపంలోని గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. కోసిగి మండలంలోని అగసనూరు గ్రామ శివారులో ఆర్డీఎస్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా కందుకూరు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీఎస్ ఆనకట్టకు వెళ్లి ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు అధికంగా ఉండటంతో ఆర్డీఎస్‌కు 90 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, ప్రవాహం ఇంకా పెరుగుతుందని సమీపంలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నిత్యానందరాజ్, ఆర్ఐ శ్రీరాములు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ ఆనకట్టపై అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

తుంగభద్ర నదీతీరంలో...

మంత్రాలయం, కౌతాళం, న్యూస్‌టుడే: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠం పక్కన ప్రవహిస్తున్న తుంగభద్ర నదీతీరాన్ని మంగళవారం సాయంత్రం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ రవితో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో తుపాను ప్రభావం ఉన్నందున కౌతాళం, మంత్రాలయం మండలంలో తుంగభద్ర నదీతీర ప్రాంతాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

తప్పిపోయిన విద్యార్థి ఆచూకీ లభ్యం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని శ్రీరామకాలనీలో నివాసం ఉంటూ తప్పిపోయిన ఇంటర్ విద్యార్థి పూజారి అనిల్‌కుమార్ ఆచూకీ లభ్యమైనట్లు గోనెగండ్ల సీఐ గంగాధర్ తెలిపారు. పూజారి వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతుల కుమారుడు పి.అనిల్‌కుమార్ సెప్టెంబరు 1న తప్పిపోయినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ విద్యార్థి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. అతను నందికొట్కూరులోని ఓ బిర్యానీ హోటల్‌లో 45 రోజులుగా పని చేస్తున్నట్లు సమాచారం రాగా మంగళవారం ఆ హోటల్‌లో విచారించగా విద్యార్థి ఆచూకీ లభ్యమైందన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గంగాధర్

నేడు సమస్య పరిష్కార వేదిక

గూడూరు, న్యూస్‌టుడే: మండల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం నగర పంచాయతీలోని వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివనాగప్రసాద్ మంగళవారం తెలిపారు.

వైకాపా ప్రభుత్వం గ్రామాలను విస్మరించింది

మాచాపురం (నందవరం), న్యూస్‌టుడే: గడిచిన ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయకుండా విస్మరించిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాచాపురం గ్రామంలో పల్లె పండగలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం పాఠశాలలో తాగునీటి కుళాయి, గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, ఈవోఆర్డీ సందీప్, తెదేపా నాయకులు కాశీంవలి, బడేసాబ్ వలి, బండే గురుస్వామి, చిన్నరాముడు, రామకృష్ణారెడ్డి, జబ్బర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

పల్లెల రూపురేఖలు మారుస్తాం

కౌతాళం, న్యూస్‌టుడే: పల్లె పండగతో గ్రామాల రూపురేఖలు మారుస్తామని మంత్రాలయం నియోజకవర్గ నాయకుడు రాఘవేంద్రరెడ్డి, కౌతాళం మండల అధ్యక్షుడు ఉలిగయ్య అన్నారు. మంగళవారం వారు పల్లె పండగలో భాగంగా మండలంలోని ఎరిగేరి, కామవరం, ఉరుకుంద గ్రామాల్లో అభివృద్ధి పనులు, సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీవో సుబ్బరాజు, పీఆర్‌ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, తెదేపా నాయకులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, రామలింగ పాల్గొన్నారు.



ఎరిగేరిలో పనులకు భూమిపూజ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి, ఉలిగయ్య

పనులు నాణ్యతతో చేపట్టాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సీసీ దారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎంపీడీవో రాముడు సూచించారు. ఎర్రదొడ్డి మజారా గ్రామం చిల్లబండ, అమడగుంట్ల గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ నిర్వహించారు. సర్పంచులు వరలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి, తెదేపా నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

సి.బెళగల్‌లో...

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. మండలంలోని కంబదహల్, చింతమానుపల్లె, పలుకుదొడ్డి గ్రామాల్లో మంగళవారం పల్లె పండగలో ఆమె మాట్లాడారు. సర్పంచులు రోజమ్మ, ఈరమ్మ, తెదేపా నాయకులు సత్యారెడ్డి, రాముడు, ప్రతాప్‌రెడ్డి, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

గూడూరులో..

పెంచికలపాడు (గూడూరు), న్యూస్‌టుడే: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో పల్లె పండగ నిర్వహిస్తోందని ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పెంచికలపాడులో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ దారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.1.15 లక్షలతో పశువుల షెడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. సర్పంచి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ, వార్డు సభ్యులతోపాటు తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల మెప్పు పొందిన ప్రభుత్వం

బూదూరు, వగరూరు, తిమ్మాపురం (మంత్రాలయం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పడ్డ తక్కువ రోజుల్లోనే రాష్ట్ర ప్రజల మెప్పు పొందిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని మాధవరం మాజీ సర్పంచి రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బూదూరు, తిమ్మాపురం, వగరూరు గ్రామాల్లో తెదేపా, జనసేన, భాజపా నాయకులు, అధికారులతో కలిసి పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

పెద్దకడబూరులో...

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నాయకులు రామకృష్ణారెడ్డి, రమాకాంతరెడ్డి అన్నారు. మంగళవారం వారు మండలంలోని బసలదొడ్డి, చిన్నతుంబళం, నాగులాపురం గ్రామాల్లో రూ.30 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. బసలదొడ్డి ఈరన్న, వీరేశ్‌గౌడ్, నరసింహులు, బొగ్గుల నరసన్న పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

వగరూరు (మంత్రాలయం), న్యూస్‌టుడే: మండలంలోని వగరూరు గ్రామంలో మంగళవారం దస్తగిరి స్వామి ఉరుసును గ్రామస్థులందరూ ఘనంగా నిర్వహించారు.

పెద్దకడబూరులో..

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లుకుంట, పెద్దకడబూరు, చిన్నతుంబళం, మేకడోన తదితర గ్రామాల్లో దస్తగిరి స్వామి ఉరుసును మంగళవారం కులమతాలకతీతంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ఫతేహాలు చేశారు.

ప్రధానోపాధ్యాయుడిపై విచారణ

పూలచింత (నందవరం), న్యూస్‌టుడే: మండలంలోని పూలచింత ఎంపీయూపీ పాఠశాలలో గత నెలలో ఇద్దరు ఉపాధ్యాయులను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రధానోపాధ్యాయుడు నరేష్‌కుమార్ సస్పెండ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు, ప్రజా సంఘాలు, కులసంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి పూలచింత పాఠశాలలో విచారణ చేపట్టారు. ఎంఈవోలు సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



డిప్యూటీ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మిశ్రమ పంటలు వేయాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు ఒకే రకం పంటలు వేయకుండా మిశ్రమ పంటలు సాగు చేయాలని ఏవో రవిప్రకాశ్ తెలిపారు. గోరంట్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రసాయనిక మందులు, ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. రబీలో వేరుసెనగ, పప్పుసెనగను వేసే సమయంలో విత్తనశుద్ధి చేయాలన్నారు.

పచ్చికబయళ్ల పరిశీలన

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్‌లోని పడమటి కొండల్లో పచ్చికబయళ్లను మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. సి.బెళగల్‌లోని 362 సర్వే నంబరులోని పచ్చికబయళ్లలో కొంత మంది రాత్రివేళ ఎర్రమట్టి తరలిస్తున్నట్లు గనుల శాఖ అధికారుల ఆదేశాలతో ఆయన ఉపతహసీల్దార్ పురుషోత్తం, వీఆర్వోలు, మండల సర్వేయర్ నాగభూషణం పర్యటించారు. అనంతరం తహసీల్దార్ తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. రీసర్వే సమస్యలపై చర్చించారు.

అంతర్గత దారులు.. అభివృద్ధి పరుగులు

☛ రూ.2 కోట్లతో పనులకు శ్రీకారం ☛ ఐదేళ్లు పట్టించుకోని వైకాపా ప్రభుత్వం



సీసీ దారి, మురుగు కాల్వ లేని కాలనీ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని విస్మరించడంతో పల్లెల్లోని అంతర్గత దారులు అధ్వానంగా మారాయి. మురుగు కాల్వలు కూడా నిర్మించలేదు. దాంతో ఇళ్ల మధ్య మురుగు ఎక్కడికక్కడ తిష్టవేసి దుర్వాసన వ్యాపిస్తోంది. పంచాయతీ నిధులను సైతం అప్పటి ప్రభుత్వం మళ్లించి నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో రవాణా మార్గాల్ని మెరుగుపర్చేందుకు శ్రీకారం చుట్టింది.

ఏకంగా 32 పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రహదారులకు పెద్ద పీట వేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 32 పనులకు ప్రతిపాదనలు చేశారు. గ్రామాల్లో అంతర్గత దారులు, మురుగు నీటి వ్యవస్థల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.2 కోట్ల అంచనాతో పనులు చేపడుతున్నారు. దాంతో ఎప్పటి నుంచో ఉన్న వీధుల్లోని మురుగు తొలగనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామం	పనులు	అంచనా (రూ.లక్షల్లో)
వెంకటగిరి	5	25
అమడగుంట్ల	4	32
పులకుర్తి	1	9
ఎర్రదొడ్డి	2	6.30
చిల్లబండ	1	6
వర్కూరు	1	7.50
కోడుమూరు	4	22
ముడుమలగుర్తి	2	10
గోరంట్ల	3	27
కల్లపరి	3	16.10
అనుగొండ	1	5
ప్యాలకుర్తి	3	19.60
రామచంద్రాపురం	1	6
కొండాపురం	1	8.50

వివిధ దశల్లో పూర్తి చేస్తాం

- గంగరాజు, పంచాయతీ రాజ్ ఇంజినీర్

ఉపాధి పథకం కింద మొదటి దశలో పనులకు శ్రీకారం చుట్టాం. అందరి సలహాలు తీసుకుని గ్రామాల్లోని జనాభా, వీధుల్లోని గృహాలను బట్టి దారులను ఎంపిక చేస్తున్నాం. రూ.2 కోట్లతో పనులు మొదలుపెట్టాం. మొదటి దశ పూర్తయిన వెంటనే మరిన్ని నిధులతో రెండో దశ కింద పనులు చేస్తాం. దాంతో అన్ని వీధులకు సిమెంటు దారులు, కాల్వలు వేస్తాం.

రైతుల సమస్యలు పరిష్కరించరా

బూడిదపాడు (గూడూరు), న్యూస్‌టుడే: భూసార పరీక్షలు నిర్వహించక సూక్ష్మపోషకాల పంపిణీ లేక పంటల దిగుబడులు తగ్గి భారీగా నష్టపోయిన మమ్మల్ని పట్టించుకునేవారే లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బూడిదపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణకు వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులకు తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు మొర పెట్టుకున్నారు. పంటల సాగులో సలహాలు ఇచ్చేవారు లేక దుకాణదారులు ఇచ్చిన మందులు పిచికారీ చేసి నష్టపోతున్నామన్నారు. అనంతరం అధికారులు పత్తి, జొన్న పంటలు పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీవాణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి అవసరం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక నగరపాలక పాఠశాలను డీఈవో శామ్యూల్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న అంశాలపై పదో తరగతి విద్యార్థులతో మాట్లాడగా సరైన సమాధానం రాకపోవడంతో ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత రావాలంటే ప్రణాళిక ఎంతో ముఖ్యమని చెప్పారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

రెండు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో జిల్లాలో రెండు మండలాల్లో వర్షం కురిసింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు కృష్ణగిరి మండలంలో 2 మి.మీ., ఓర్వకల్లు 1 మి.మీ. పడింది. జిల్లా సగటున 0.1 మి.మీ.గా నమోదైంది. జిల్లాలో సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటి వరకు 42.2 మి.మీ.గా ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, సమస్య : నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఇంజినీర్స్ కాలనీలో కాలువలు అధ్వానంగా మారాయి. **– స్థానికులు**

సమస్య: బంగారుపేట సమీపంలో రహదారులపై వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. **– సుధాకర్**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక సంస్థ అధికారులు**

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.4,081

కర్నూలు వ్యవసాయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. విపణికి 7,122 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.509, మధ్యస్థ ధర రూ.2,803, గరిష్ఠ ధర రూ.4,081 పలికింది. వేరుశనగకాయలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,634, పూల విత్తనాలు రూ.5,509, ఆముదాలు రూ.5,984, వాము రూ.17,222కు వ్యాపారులకు కొనుగోలు చేశారు.

అవసరమైన వసతులు కల్పిస్తాం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: శివారు కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. ఆయన మంగళవారం 19వ వార్డు జొహరాపురం బీడీ వర్కర్స్ కాలనీలో పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. నగరపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. దారి తప్పి

■ గుంతలమయంగా రహదారులు ■ 19వ వార్డులో వసతులు అంతంతే..

కర్నూలు వైద్యాలయం, కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగర పరిధిలోని 19 వార్డు.. నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, సాయివైభవ్ నగర్, రెవెన్యూ కాలనీల మీదుగా నంద్యాల చెక్‌పోస్టుకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఈ ప్రాంతాల్లో 50 వేల మందికిపైగా జనం నివసిస్తున్నారు. ఈ వార్డు నుంచే నగరపాలక సంస్థ మేయర్‌గా బీవై రామయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా అభివృద్ధి అంతంతమాత్రమే. వార్డులో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. రహదారులు పూర్తిగా ధ్వంసమైనా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో కనీసం గుంతల మార్గాల్లో మట్టి వేసిన దాఖలాలు లేవు.

మరమ్మతులు మరిచి..

గణేశ్ నగర్ నుంచి సాయివైభవ్ నగర్ మీదుగా అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టాల్సి ఉండగా నగరపాలక అధికారుల నిర్లక్ష్యం వహించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. బీవై రామయ్య మేయర్‌గా ఎన్నికైనా రహదారులను అభివృద్ధి చర్యలు తీసుకోలేదు. అభివృద్ధి పనులకు పెద్దపీట వేసిన నిధులు కేటాయించినట్లు వైకాపా పాలకులు గొప్పలు చెప్పారు. కానీ కనీసం రహదారులను అభివృద్ధి చేయలేని పరిస్థితి. ఈ మార్గంలో ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు.



రెవెన్యూ కాలనీ నుంచి వెళ్లే రహదారి దుస్థితి

ప్రయాణం.. ప్రమాదకరం

నగరంలో చిన్నపాటి వర్షం పడితే చాలు.. పాదచారులతోపాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. కర్నూలు బీక్యాంపు నుంచి బిర్లాగేటు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచిపోతుండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కాలువలు సరిగా లేకపోవడంతో నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతోంది. వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి దెబ్బతిన్నా నగరపాలక పాలకులు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.



ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: భారీ వర్షాలు పడుతాయన్న హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కర్నూలు జొహరాపురం వంతెన వద్ద హంద్రీ నదిలో నీటి ప్రవాహాన్ని, పాతబస్తీలోని రాఘవేంద్రస్వామి మఠం వెనుక తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతాన్ని కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. 5 లక్షల క్యూసెక్కుల వరద నీరొస్తే కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశముందని.. ప్రస్తుతం 60 వేల క్యూసెక్కులు మాత్రమే ఉందని అధికారులు వివరించారు. మ్యాపు ద్వారా ముంపునకు గురయ్యే అవకాశమున్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో అల్పపీడన ప్రభావం అంతగా లేదని, అయినప్పటికీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హంద్రీ నదికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పట్టు తప్పితే ప్రమాదమే



కర్నూలు మండల పరిధిలోని పడిదెంపాడు మార్గంలో మత్స్యకారులు కాలువలో ప్రమాదకరంగా చేపల వేట సాగిస్తున్నారు. ఓ వ్యక్తి పంట కాలువ గోడ ఎక్కి గాలాలు వేశారు. ఏమాత్రం పట్టు తప్పినా కాలువలో పడిపోయే పరిస్థితి. **- ఈనాడు, కర్నూలు**

గంగమ్మ చుట్టుముట్టి



తుంగభద్ర నదికి వరద నీరు పెద్దఎత్తున వస్తోంది. నగరంలోని సంకల్‌బాగ్ ఘాట్ ప్రాంతంలో గంగమ్మ గుడి కొంతమేర మునిగిపోయింది. ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో నీటిమట్టం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. **- ఈనాడు, కర్నూలు**

ఏపీఆర్ఎస్ఏ తాత్కాలిక అధ్యక్షుడిగా రామాంజనేయరెడ్డి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘానికి తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయరెడ్డి (అర్బన్ ఏఎస్‌వో)ను ఎన్నుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ పొదుపు భవన్‌లో మంగళవారం ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గిరికుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 20న ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం నుంచి ఒకరు జిల్లాకు రానున్నారు. రాష్ట్ర పరిశీలకుల సమక్షంలో ఏపీఆర్ఎస్ఏ కర్నూలు జిల్లా నూతన అధ్యక్ష ఎన్నిక జరగనుంది. కర్నూలు డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కోశాధికారి బాను, ఆదోని, పత్తికొండ, కలెక్టరేట్ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు రజనీకాంత్‌రెడ్డి, వలీబాషా, నాగరాజు, మల్లికార్జున, వెంకటరాజు, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనుమానాస్పద స్థితిలో కాపలాదారుడి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు బిర్లాగడ్డ వీధికి చెందిన మల్లయ్య (58) అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. అతను ఎస్వీ కాంప్లెక్స్ కాపలాదారుడిగా పనిచేసేవారు. భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఇంటికి వెళ్తూ రాజ్‌విహార్ కూడలిలో తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లారు. కొందరు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. అతను ఎలా గాయపడ్డారన్నది మిస్టరీగా మారింది. కర్నూలు రెండో పట్టణ పోలీసులు బాధితుడి కుటుంబసభ్యులను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్లయ్య (పాత చిత్రం)

ఇరువర్గాల ఘర్షణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని బంగారుపేటలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గుంతకల్లు నుంచి వచ్చిన కొందరు బంగారుపేటలో సారా తాగేందుకు వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో స్థానికులకు, గుంతకల్లు వాసులకు మధ్య ఘర్షణకు జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. గుంతకల్లుకు చెందిన భరత్, పవన్, మస్తాన్, బంగారుపేటకు చెందిన కృష్ణ గాయపడ్డారు. కర్నూలు రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఇన్‌ఛార్జి ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎస్.రఫీకి మెమో జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఎస్ఈ రాజశేఖర్ మెమో జారీ చేశారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: హంద్రీ, కేసీ కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు మంగళవారం నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును కలిసి పలు సమస్యలు విన్నవించారు. పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రూ.పది నాణెం చెల్లుబాటుపై కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. రోజువారీ లావాదేవీలకు రూ.10 నాణేలు వినియోగించుకోవచ్చని ఆ బ్యాంకు అధికారులు ప్రజలకు వివరించారు. దీనిపై ఉన్న అపోహలు వీడాలని పేర్కొన్నారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నగరంలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రఘురామ్ ఆర్మీ వింగ్ నుంచి లెఫ్టినెంట్ ర్యాంక్‌ను మేజర్ జనరల్ కపిల్జిత్‌సింగ్ రాథోడ్ చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. కళాశాల డీన్ అడ్మినిస్ట్రేషన్ వై.శౌరీలురెడ్డి, ప్రిన్సిపల్ డా.కె.శాంత, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ అభినందించారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: తను నమ్మిన సిద్ధాంతాల కోసం ప్రొఫెసర్ సాయిబాబా తుదిశ్వాస వరకు నిలిచారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సీఆర్ భవన్‌లో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం మునగాలపాడులో మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి మంగళవారం సారా బట్టీలపై దాడులు చేశారు. నీలిషికారి శాంతిని అరెస్టు చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు స్టేషన్‌లో అప్పగించటంతో ఆమెపై కేసు నమోదు చేశారు.



ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని సన్మానిస్తున్న ఏపీఎం పుష్పావతి, పొదుపు మహిళలు

స్థలం కేటాయించాలని వినతి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్త్రీ శక్తి భవనానికి స్థలం కేటాయించాలని పొదుపు మహిళలు కోరారు. ఏపీఎం పుష్పావతి, పొదుపు మహిళలు కలిసి మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని సత్కరించారు. వారు మాట్లాడుతూ స్థలం కేటాయించేందుకు కృషి చేయాలని.. ప్రస్తుతం అద్దె భవనంలో కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థల కేటాయింపు జరిగితే సొంత భవన నిర్మాణానికి నిధులు వస్తాయని వెల్లడించారు.

వరద బాధితులకు విరాళం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష విరాళాన్ని కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి, ఆమె తండ్రి, విద్యాసంస్థల అధినేత డా.కేవీ సుబ్బారెడ్డి అందించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోకా ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ అశోక్‌వర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న పద్మలతారెడ్డి తదితరులు

సాగులో మెలకువలు తప్పనిసరి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: పంటల సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని హుసేనాపురం, ఓర్వకల్లు, లొద్దిపల్లె, ఉప్పలపాడు తదితర గ్రామాల్లోని కంది పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ పంటకు పురుగు ఆశిస్తుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పలు సూచనలు, సలహాలు అందించారు.

నిధులు మంజూరు చేస్తాం

ఓర్వకల్లు న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమరోలులో పలు అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకైనా నిధులు పుష్కలంగా ఉన్నాయన్నారు. తీర్మానాలు చేసి పంపితే నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఆటోలకు టాప్ నంబర్లు తప్పనిసరి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులో ఆటోలు నడిపే డ్రైవర్లందరూ ఈనెలాఖరులోగా పోలీసు శాఖ జారీ చేసే ఆటో టాప్ నంబర్లు పొందాలని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆదేశించారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఆటో యూనియన్ నాయకులతో కలిసి పలు కూడళ్లలో ఆటో డ్రైవర్లతో సమావేశమై అవగాహన కల్పించారు. టాప్ నంబర్లు తీసుకోకుండా నిర్లక్ష్యంగా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, రాధాకృష్ణ, రవి, హుస్సేన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

స్వచ్ఛతకు ప్రాధాన్యం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: స్వచ్ఛత పక్వాడా 2024లో భాగంగా ఉద్యోగులు రైల్వే స్టేషన్‌తోపాటు పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. రైల్వే స్టేషన్‌లో మంగళవారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. రైల్వే ఆరోగ్య అధికారి డా.వినయ్‌కుమార్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మనోజీరావు, ఆర్‌పీఎఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

ఘనంగా ఉరుసు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగర పరిధి జొహరాపురంలోని సయ్యద్ అల్లాబకాష్ ఖాద్రీ దర్గా ఉరుసు వైభవంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి సయ్యద్ షరీఫ్ పాషా, అఫ్సర్ పాషా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

కొత్త రీచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కొత్త ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలను అనుమతించాలని గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంపై మంగళవారం విజయవాడ నుంచి సమీక్షించారు. నేటి నుంచి కొత్త ఇసుక రీచ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. మరళిలో కొత్తగా ఇసుక రీచ్ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా నివేదించారు.

నాణ్యతగా ఉపాధి పనులు

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులు నిర్ణీత గడువులో పూర్తిస్థాయి నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ కర్నూలు ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి ఆదేశించారు. జడ్పీలోని సర్కిల్ కార్యాలయంలో మంగళవారం కర్నూలు డివిజన్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈఈ మద్దన్న, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ రవీంద్రరెడ్డి, డీఈఈ శ్రీనివాసులు, రమేష్‌కుమార్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.




పీఆర్ ఇంజినీర్లతో సమావేశమైన ఎస్ఈ రామచంద్రారెడ్డి

అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: దేశానికి అబ్దుల్ కలాం అందించిన సేవలు ఎనలేనివని సహాయ గ్రంథాలయ అధికారి గోవింద రెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక గ్రంథాలయాధికారి బాషా, రికార్డు అసిస్టెంట్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

● కర్నూలు బి.క్యాంపులో ఉన్న ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు.



ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కలాం చిత్రపటానికి నివాళి

గురిపెట్టి .. పతకాలు పట్టి

☛ క్రీడల్లో ఆర్‌యూ ఇంజినీరింగ్ విద్యార్థుల సత్తా

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వివిధ పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఒకవైపు చదువుపై శ్రద్ధ చూపుతూనే.. మరో వైపు తమకు ఇష్టమైన క్రీడల్లో ప్రతిభ చాటుతూ పతకాలు అందుకుంటున్నారు. ఆయా జట్లలో కీలకపాత్ర పోషిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

విజయాల జయసింహా

నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన జయసింహా నగరంలోని ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. ఇతనికి మొదటి నుంచి క్రీడలంటే ఎంతో మక్కువ. ఈ నేపథ్యంలో పలు పోటీల్లో పాల్గొన్నారు. గతేడాది మార్చిలో ఆర్‌యూ క్రీడా మైదానంలో జరిగిన ఆలిండియా సెపక్‌తక్రా పోటీల్లో ఆర్‌యూ తరపున పాల్గొన్నారు. అనంతపురంలో జరిగిన బేస్‌బాల్ పోటీల్లోనూ రాణించి పతకం అందుకున్నారు. గతేడాది సెప్టెంబరులో బిహార్‌లో జరిగిన జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ఏపీ తరపున పాల్గొని సత్తా చాటారు. ఈ ఏడాది అక్టోబరు మొదటి వారంలో జరిగిన అనుబంధ కళాశాలల కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జట్టుకు టైటిల్ ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా జయసింహా మాట్లాడుతూ దక్షిణ మండలం అంతర విశ్వవిద్యాలయ పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని చెప్పారు.



మెరిసిన రఘునాథ్

కోసిగి మండలం బెళగల్ ప్రాంతానికి చెందిన రఘునాథ్ ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. గతేడాది మార్చిలో ఆర్‌యూ క్రీడా మైదానంలో జరిగిన దక్షిణ మండలం అంతర విశ్వవిద్యాలయ సెపక్‌తక్రా పోటీల్లో ఆర్‌యూ తరపున ప్రాతినిధ్యం వహించారు. అదే ఏడాది సెప్టెంబరులో నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల కబడ్డీ పోటీల్లో రన్నరప్ ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఈ ఏడాది అక్టోబరు మొదటి వారంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల కబడ్డీ పోటీల్లో ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడ్డారు. ఆర్‌యూకు టైటిల్ ట్రోఫీ అందించడంలో కీలకపాత్ర పోషించారు. విశ్వవిద్యాలయ పోటీల్లో రాణించేందుకుగాను ప్రతిరోజూ రెండు గంటలపాటు సాధన చేస్తున్నట్లు తెలిపారు.



పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

చిన్నటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం చిన్నటేకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చేతుల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

దుకాణాల తొలగింపు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో రహదారులపై అక్రమంగా ఏర్పాటుచేసిన దుకాణాలను నగరపాలక పట్టణ ప్రణాళిక అధికారులు మంగళవారం తొలగించారు. బిర్లాగేటు సమీపం స్మార్ట్ స్ట్రీట్ వద్ద, సి.క్యాంపు కూడలి, వాల్‌మార్టు సమీపం తదితర ప్రాంతాల్లో దుకాణాలు తొలగించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు సి.విశ్వనాథ్ తెలిపారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హెచ్ఎన్ఎస్ఎస్-యూనిట్-3 ప్రత్యేక ఉప కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను కర్నూలు జిల్లా హౌసింగ్ పీడీగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో విధుల్లో చేరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, జి.సింగవరం, నిడ్జూరు గ్రామాల్లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీలకు మరిన్ని నిధులు కేటాయించి పల్లెల ప్రగతికి పాటుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



జి.సింగవరంలో పాల్గొన్న ఎమ్మెల్యే దస్తగిరి



పంచలింగాలలో భూమి పూజ చేస్తున్న ఎంపీ నాగరాజు

ఏటా 30 వేల శస్త్రచికిత్సలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలలో అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో ఏటా చిన్న, పెద్ద శస్త్రచికిత్సలు కలిపి 30 వేల వరకు నిర్వహిస్తున్నట్లు అనస్థీషియా వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. అనస్థీషియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దాస్పత్రిలోని అత్యవసర విభాగంలో వైద్యులు రామ్‌శివనాయక్, మురళీ ప్రభాకర్, శారదతో కలిసి మంగళవారం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బోధన ఆస్పత్రుల్లోకంటే కర్నూలు ఆసుపత్రిలో అత్యధికంగా.. అన్నిరకాల శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్‌కుమార్

ఉత్తర్వు 114 అమలు చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకుల సమస్యల పరిష్కారానికిగాను ఉత్తర్వు 114ను వెంటనే అమలు చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ కోరారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో బ్యాడ్జీలు ధరించి కళాశాలల వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. దీనిని నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అధ్యాపకులు నక్కిం ఉద్దీన్, జ్యోతి, విజయలక్ష్మి, నుస్రత్, విజయ కుమారి, పర్జానా బేగం పాల్గొన్నారు.



కేవీఆర్ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు